క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

మంచాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తుందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెన్నారెడ్డిగూడ గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన రమావత్ అంకితకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు పరంగీ, నాయకులు గోపాల్, శంకర్, శ్రీశైలం, సరోజ, సందీప్, రవి, లక్ష్మానాయక్, సుధాకర్, మధు, సురేశ్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



మధూకర్‌ను పరామర్శిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: మాడ్గుల్ మండలం కొలుకుపల్లి గ్రామానికి చెందిన నాగిళ్ల మధూకర్ అనారోగ్యంతో బాధపడుతూ, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి బుధవారం ఉదయం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి యువకుడి ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి వైద్యులకు సూచించారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్, శేఖర్, సతీశ్, శివ తదితరులున్నారు.

బస్‌పాస్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలి



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేస్తున్న సుచరిత

ఇబ్రహీంపట్నం: దివ్యాంగులకు ఆర్టీసీ కల్పిస్తున్న ఉచిత బస్‌పాస్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ డిప్యూటీ ఆర్‌ఎం సుచరిత అన్నారు. బుధవారం ఆమె ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్టాండ్‌లో దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఆర్‌ఎం మాట్లాడుతూ.. ఆర్టీసీ కల్పిస్తున్న దివ్యాంగులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి, ఆర్టీసీ సిబ్బంది వీరన్న, మల్లేశ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా ప్రభాకర్‌గౌడ్



నియామకపత్రం అందజేస్తున్న మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా బండరావిరాల గ్రామానికి చెందిన కొత్త ప్రభాకర్‌గౌడ్ రెండోసారి నియమితులయ్యారు. పార్టీ అధ్యక్షుడితో పాటు మండల కమిటీలో మొత్తం 60మందికి చోటు కల్పిస్తూ వారికి బుధవారం పీసీసీ ఉపాధ్యక్షుడు మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి నియామక ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రంగారెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి మట్లాడుతూ పార్టీ పటిష్టతకు, కార్యకర్తల సంక్షేమం కోసం అందరినీ కలుపుకుపోతూ నూతన కమిటీ పనిచేయాలని సూచించారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం శ్రమించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రేఖ, జెడ్పీటీసీ సభ్యుడు దాసుగౌడ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

వీడని ముసురు

ఇబ్రహీంపట్నం: తుఫాన్ ప్రభావంతో మండల వ్యాప్తంగా మంగళవారం తెల్లవారుజాము నుంచి వర్షం కురుస్తుంది. మంగళవారం ఉదయం 8గంటల వరకు 18 మి.మీటర్లు, బుధవారం ఉదయం 8 గంటల వరకు 17 మీ.మీటర్ల వర్షపాతం నమోదయింది. రెండు రోజులుగా ఎడతెరిపిలేకండా జల్లులు కురుస్తుండటంతో భూమి పదనుపట్టింది. రోడ్లపై జనసంచారం తగ్గిపోయింది. వాతావరణం చల్లగా మారడంతో వృద్ధులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షకాలంలో అనారోగ్యానికి గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

మొక్కుబడిగా సర్వసభ్య సమావేశం

- అవిశ్వాసంపై ప్రశ్నించిన ఎంపీపీ
- సభ ప్రారంభమైన కాసేపటికే వెళ్లిపోయిన ఎంపీటీసీ సభ్యులు
- ఎజెండాను వినిపించిన అధికారులు



మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

కడ్తాల్: ప్రజా సమస్యల పరిష్కారానికి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఎంపీపీ అనిత అధ్యక్షతన ఆమనగల్లు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, మరో ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు, 13 మంది సర్పంచ్‌లు హాజరయ్యారు. సమావేశంలో తొలుత వ్యవసాయ శాఖపై సమీక్షించారు. చర్చ మధ్యలోనే ఎంపీపీ తనపై అవిశ్వాసం ఎందుకు పెట్టారో చెప్పాలని ఎంపీటీసీ సభ్యులను ప్రశ్నించారు. దీంతో వెంటనే వైస్ ఎంపీపీ అనంతరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కుమార్, సరితా నాయక్, మంగమ్మ సర్వసభ్య సమావేశం నుంచి వెళ్లిపోయారు. అనంతరం విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, ప్రాథమిక విద్య, ఇందిరా క్రాంతిపథకం తదితర శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలను వినిపించారు. ఆకుతోటపల్లి లైన్‌మెన్ మార్చాలని కోఆప్షన్ సభ్యుడు హాజీ పాషా సభ దృష్టికి తెచ్చారు. ఇందుకు ఏఈ సీతారాములు స్పందిస్తూ విద్యుత్ సిబ్బంది కొరత ఉందని.. త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలకు పరికరాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని మాలేపల్లి సర్పంచ్ శ్రీను సభ దృష్టికి తెచ్చారు. మండల సర్వసభ్య సమావేశం సందర్భంగా నలుగురు ఏఎస్‌ఐలు, పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ పీడీ నీరజ, సహాయ ప్రాజెక్ట్ అధికారి ఛత్రునాయక్, ఎంపీడీఓ ఫారుఖ్ హుస్సేన్, హార్టికల్చర్ అధికారి అశోక్, సెర్ప్ ప్రాజెక్ట్ సహాయ అధికారి జంగారెడ్డి, ఏఓ అరుణకుమారి, వైద్యాధికారి పరీక్షిత్ నరేందర్, ఏఈ సీతారాములు, పీఆర్‌ఏఈ కృష్ణయ్య, ఏంఈఓ సర్దార్‌నాయక్, సర్పంచ్‌లు అమర్‌సింగ్, లక్ష్మణ్, శ్రీను, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

మండల మహిళా సమాఖ్య వార్షికోత్సవంలో ఎంపీపీ కృపేశ్



ప్రగతి నివేదికను విడుదల చేస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం: మహిళలు నేడు అన్ని రంగాలల్లో రాణిస్తున్నారని ఎంపీపీ కృపేశ్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నిర్మల అధ్యక్షతన సమాఖ్య 15వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ కృపేశ్ జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. మహిళలు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను వినియోగించుకుని మహిళా సంఘాల సహకారంతో సుస్థిర జీవనోపాధిని పొందాలన్నారు. ప్రగతి సాధనలో జిల్లా వ్యాప్తంగా ఇబ్రహీంపట్నం మండల మహిళా సమాఖ్య ముందుందన్నారు. మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. గ్రామాల్లోని మహిళ సంఘాల భవనాల్లో మరుగుదొడ్లు, డ్వాక్రా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరుకు ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆర్థికంగా, సామాజికంగా మహిళలు ఎదిగినప్పుడే దేశం త్వరితగతిన అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య వార్షిక ప్రణాళిక రిపోర్టును, ప్రగతి నివేదికను ఎంపీపీ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జయరాం విజయ్, డీసీఎంలు స్వర్ణలత, నిర్మల, ఏపీఎం రవీందర్, స్త్రీనిధి మేనేజర్ ప్రసాద్, సీబీఓ ఆడిటర్ శ్రీనివాస్, మహిళా సమాఖ్య కార్యదర్శి మహేశ్వరి, కోశాధికారి జ్యోతి, ఉపాధ్యక్షుడు లక్ష్మి, ఎంవీఎస్ అధ్యక్షుడు జంగయ్య వివిధ గ్రామ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి' ఉద్యోగులకు పే స్కేల్ ప్రకటించాలి

సంఘం నాయకుడు శివశంకర్‌రెడ్డి

యాచారం: ఉపాధి హామీ ఉద్యోగులకు పర్మినెంట్ ఉద్యోగులుగా గుర్తించి, పే స్కేల్ ద్వారా జీతాలు ఇవ్వాలని ఆ సంఘం జిల్లా జేఏసీ నాయకుడు శివశంకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఉపాధి హామీ పథకం జేఏసీ నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 3,874 మంది ఉద్యోగులు ఉన్నారని.. అందరికి పే స్కేల్ ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు.

నులిపురుగుల నివారణ మాత్రలు వేయించండి

డాక్టర్ పరిక్షిత్ నరేందర్



అవగాహన ర్యాలీలో పాల్గొన్న వైద్య సిబ్బంది

కడ్తాల్: ఏడాది వయస్సు నుంచి 19ఏళ్ల లోపు బాల బాలికలకు తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేయించాలని డాక్టర్ పరిక్షిత్ నరేందర్ సూచించారు. గురువారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఏఎన్‌ఎం, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలతో ఆమనగల్లు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

శిక్షణ తరగతులకు దశరథం



ఘట్టప్రభలో శిక్షణ కార్యక్రమానికి హాజరైన దశరథం తదితరులు

తలకొండపల్లి: కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా సేవాదళ్ పని చేస్తోందని కాంగ్రెస్ సేవాదళ్ మండలాధ్యక్షుడు కానుగుల దశరథం అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఈ నెల 14 నుంచి 23 వరకు సేవాదళ్ నాయకులకు శిక్షణ ఇవ్వాలని ఆలిండియా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు లాల్‌జీ పిలుపునిచ్చారు. ఈ మేరకు కర్ణాటక రాష్ట్రం, బెల్గాం జిల్లా, ఘట్టప్రభ తాలూకాలోని నేషనల్ ట్రైనింగ్ క్యాంపునకు ఆయన హాజరయ్యారు.

ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌పై అంతర్జాతీయ సదస్సు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అనువార్తనాలు అనే అంశంపై ఈ నెల 21 ,22 తేదీల్లో సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సదస్సులో ఆసియా, ఐరోపా, అమెరికా తదితర ఖండాలకు చెందిన నిపుణులు, ప్రముఖ విశ్వవిద్యాలయాల ఆచార్యులు పాల్గొంటారని పేర్కొన్నారు. మారుతున్న శాస్త్ర సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మక మార్పులపై చర్చిస్తారని తెలిపారు. ఈ సదస్సుకు నిర్వహకులుగా ఎం. రాఘవ, డాక్టర్ ఏ. వాణి వ్యవహరిస్తారని తెలిపారు .

మండలాన్ని ఏర్పాటు చేసేవరకు దీక్షలు



దీక్ష చేస్తున్న జేఏసీ నాయకులు

వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించే వరకు దీక్షలు కొనసాగుతాయని వైస్ ఎంపీపీ శ్రీనివాసురెడ్డి అన్నారు. బుధవారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడాడుతూ.. 17 రోజులుగా దీక్షలు చేపట్టినా ప్రభుత్వం స్పందించకపోవడం సరికాదన్నారు. నాయకులు, అధికారుల అలసత్వం కారణంగానే మండలం ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు కొనసాగుతయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జంగమ్మ, మైసయ్య, దామోదర్, డేవిడ్, మహేశ్, రాములు, లక్ష్మణరావు, రామచంద్రయ్య, పాండు, ముత్యాలు, రేణురెడ్డి, బాలస్వామి, లక్ష్మీపతి, చెన్నయ్య, దైవానందం, జంగోజి, మోహన్, కొండల్, నక్క మోహన్, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

వివాహిత హత్య కేసులో నిందితుడికి జైలు

రూ.10 వేల జరిమానా

రంగారెడ్డి కోర్టులు: మహేశ్వరం ఠాణా పరిధిలో 2014లో నమోదైన వివాహిత దోషపూరిత హత్య కేసులో నిందితుడు ఐల వెంకటేశ్ గౌడ్(38)కు రంగారెడ్డి జిల్లా 11వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 10 వేలు జరిమానా విధించారు. ఏపీపీ వి. రవికుమార్ కథనం ప్రకారం... వెంకట రామయ్య అనే లారీ డ్రైవర్ తెల్లరాయి లోడ్‌తో మహేశ్వరం మీదుగా షాద్‌నగర్ నుంచి చెన్నై బయలుదేరాడు. మహేశ్వరం గ్రామం దాటాక సుమారు రాత్రి 8 గంటలకు ఒక జంట రోడ్డు పక్కన నిలబడి గొడవపడుతోంది. ఇది గమనించిన డ్రైవర్ లారీని నెమ్మదిగా పోనిచ్చాడు. ఇంతలో మహిళతో గొడవపడుతున్న వ్యక్తి ఆమెను చేతితో గట్టిగా కొట్టడంతో ఆమె లారీ చక్రాల కిందపడింది. కాగా, మహిళ లారీ కింద పడిన విషయాన్ని గమనించి తాను లారీని ఆపేలోపే వెనుక చక్రాలు ఆమెపై ఎక్కేయడంతో మరణించిందని, మహిళ మృతికి కారణమైన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లారీ డ్రైవర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు. విచారణలో మృతురాలు కేతావత్ దేవిగా నిర్ధారించుకున్నారు. నిందితుడు ఐల వెంకటేశ్ గౌడ్‌ను రిమాండ్‌కు తరలించి కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి వై.జయప్రసాద్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

ప్రభుత్వం స్పందించకుంటే..



ఇబ్రహీంపట్నం: పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న యాదయ్య



మంచాల: డీఎల్‌పీఓ సంధ్యారాణికి వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కార్మికులు

- రేపు కలెక్టరేట్ ముట్టడిస్తాం
- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య

ఇబ్రహీంపట్నం/యాచారం: గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరుగంటి యాదయ్య హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో జీపీ కార్మికుల చేపట్టిన శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కారానికి 14 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 21న కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి పూల యాదయ్య, కార్మిక సంఘ నాయకులు శివకుమార్, గోవర్ధన్, దాసు, అశోక్, పాండు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓకు వినతి

మంచాల: పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్ టీపీ నాయకులు మాదగోని జంగయ్యగౌడ్, నేనావత్ శ్రీనివాస్ అన్నారు. మండల కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికుల ఆందోళనకు మద్దతుగా బుధవారం వైఎస్సార్ టీపీ సభ్యులు దీక్షలలో కూర్చున్నారు. మంచాల మండల కార్యాలయం విచ్చేసిన డీఎల్‌పీఓ సంధ్యారాణికి పంచాయతీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కృష్ణ, పంచాయతీ కార్మిక సంఘం నాయకులు పాండు, ఖాజా పాషా, భాస్కర్, జగన్, శంకరయ్య, రవి, సురేశ్, యాదయ్య, వెంకటయ్య, దర్శన్, రోషమ్మ, స్వరూప, అర్జున్, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

'నల్సా'తో ప్రజలకు సమన్యాయం

సీనియర్ సివిల్ జడ్జి ఇందిర



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

హయత్‌నగర్: అందరికీ సమాన న్యాయం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు(నల్సా) ఉచిత న్యాయ సేవలు అందిస్తాయని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి ఇందిర అన్నారు. బుధవారం అబ్దుల్లాపూర్‌మెట్ ఎంపీడీఓ కార్యాలయంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ(నల్సా) అందజేస్తున్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ద్వారా పేద ప్రజలు, ఒంటరి మహిళలు, నిరక్ష్యరాస్యులు ఆర్థికంగా వెనకబడిన వారికి ఉచిత న్యాయ సలహా లభిస్తుందని, ఉచితంగా సేవలు అందుతాయనే విషయం అందరికీ వివరించాలన్నారు. సమాజంలో అక్రమ రవాణాకు గురైన బాధితుల కోసం, బాలల హక్కులను పరిరక్షణకు, బాల కార్మిక బాధితుల కోసం, మానసిక, శారీరక వైకల్యం ఉన్నవారికి, లైంగిక వేధింపులకు గురైన బాధితుల కోసం, వేధింపులకు గురవుతున్న సీనియర్ సిటిజన్స్ కోసం, యాసిడ్ దాడులకు గురైన బాధితులకోసం, మానవ హక్కులను కోల్పోతున్న బాధితులకు నల్సా న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి, ప్రభాకర్, ఎంపీడీఓ మమతాభాయి, జిల్లా సహాయ అధికారి పద్మజ, హయత్‌నగర్ బార్ అసోషియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్,, సఖీ కోఆర్డినేటర్ మంజుల, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఆంజనేయులు, న్యాయవాదులు రామ్మోహన్, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



దరఖాస్తులు స్వీకరిస్తున్న బాల్‌రెడ్డి

అగ్రి లీగల్ సర్వీసెస్ అథారిటీ కో ఆర్డినేటర్ బాల్‌రెడ్డి

కడ్తాల్: వ్యవసాయ న్యాయ సలహాకేంద్రాల ద్వారా రైతులకు న్యాయపరమైన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అగ్రి లీగల్ సర్వీసెస్ అథారిటీ కోఆర్డినేటర్ బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆమనగల్లు పట్టణంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులు న్యాయపరమైన సమస్యలపై కోఆర్డినేటర్ బాల్‌రెడ్డికి దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రాణి రైతులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లికి చెందిన బంగారుగడ్డ జంగయ్య కొంత కాలంగా లివర్ వ్యాధితో బాధ పడుతున్నాడు. ఆయన ఆర్థికంగా ఇబ్బందిగా ఉండడంతో వైద్య పరీక్షలకు దూరంగా ఉన్నాడు. విషయం తెలుసుకున్న ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి జంగయ్యను అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఆయన ఆస్పత్రి ఖర్చులకు సహకారం అందిస్తామని చెప్పారు. ఈ మేరకు ఆయన బుధవారం ఫౌండేషన్ సభ్యులచే రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పాండు, నరేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమార్‌గౌడ్, డేవిడ్, కిషన్, ప్రశాంత్‌రెడ్డి, నరసింహ, భరత్, శ్రీను, జనార్దన్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.5వేలు

కడ్తాల్: ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఐక్యత ఫౌండేషన్ సభ్యులు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డి అందజేసిన రూ.5 వేల ఆర్థికసాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పంతునాయక్, ఉప సర్పంచ్ మల్లేశ్, రవి, నారయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగిళ్లలో 'ఉప్పల' సభ్యులు

కడ్తాల్: మాడ్గుల మండలం నాగిళ్ల గ్రామానికి చెందిన సురమళ్ల అంజయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ అందజేసిన రూ.3వేలు కుటుంబ సభ్యులకు ఇచ్చారు. కార్యక్రమంలో మహేశ్, రాధాకృష్ణ, రాములు, యాదయ్య, లింగం, మహేందర్ తదితరులున్నారు.

ఎస్‌ఐ వెంకటేశ్‌కు బెస్ట్ ఎస్‌హెచ్‌ఓ అవార్డు



ఎస్‌ఐకి అవార్డు అందజేస్తున్న పోలీస్ కమిషనర్

తలకొండపల్లి: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్ బెస్ట్ ఎస్‌హెచ్‌ఓగా ఎంపికయ్యారు. ఈ మేరకు పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర చేతుల మీదుగా గురువారం అవార్డు అందుకున్నారు. మండల పరిధిలోని వెల్జాల్‌లో ఇటీవల జరిగిన ఓ మర్డర్ కేసును త్వరగా ఛేదించి, నిందితులను అరెస్టు చేసినందుకుగాను ఎస్‌ఐకి అవార్డు అందజేశామని తెలిపారు. శంషాబాద్ డీసీపీ, షాద్‌నగర్ ఏసీపీ, ఆమనగల్లు సీఐలు వెంకటేశ్‌ను అభినందించారు.

కుల సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడిగా పరమేశ్



నియామకపత్రం అందుకుంటున్న పరమేశ్

తుర్కయంజాల్: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక మున్సిపల్ అధ్యక్షుడిగా మునగపాటి పరమేష్ నేతను నియమించినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహయాదవ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పరమేశ్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జాతీయ సంచార జాతుల కమిషన్ సభ్యుడు నరసింహ, జిల్లా అధ్యక్షుడు అంజయ్య గౌడ్, బీసీ కుల సంఘాల రాష్ట్ర నాయకుడు కటికం నరసింగరావు, ప్రధాన కార్యదర్శులు గుండ్ల ఆంజనేయులుగౌడ్, శంకర్ ప్రజాపతి, దావా శ్రీనివాస్, నాయకులు రాజుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నాడు డంపింగ్ యార్డు.. నేడు క్రీడా ప్రాంగణం

మైదానానికి మలిదశ ఉద్యమకారుడి పేరు

- యువత, కార్పొరేషన్ వాసులకు ఉపయోగపడేలా వసతుల కల్పన
- స్థానికుల్లో సంతోషం



సిరిపురం యాదయ్య(ఫైల్)

బడంగ్‌పేట్: మహేశ్వరం మండలం నాగారం గ్రామానికి చెందిన సిరిపురం యాదయ్య తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో చురుగ్గా పాల్గొని రాష్ట్రం కోసం అమరుడయ్యాడు. దీంతో ఆయన స్ఫూర్తి ఎప్పటికీ గుర్తుండేలా నియోజకవర్గం పరిధిలోని బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని క్రీడా మైదానానికి ఆయన పేరు పెట్టారు. ఇందుకు విద్యాశాఖమంత్రి సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులను ఒప్పించారు. ఇందుకు ఉద్యమకారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



యాదయ్య పేరుతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం

ఇబ్బంది పడిన స్థానికులు

నాలుగున్నర ఎకరాల్లో విస్తరించిన ఈ మైదానం బడంగ్‌పేట నగర పంచాయితీగా ఉన్నప్పుడు స్థలాభావం కారణంగా ఇక్కడే చెత్త డంప్ చేసేవారు. క్రమంగా చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఒక దశలో సొంతిళ్లు ఉన్నవారు సైతం ఇళ్లను ఖాళీ చేసి వెళ్లిపోయారు. చెత్తకు నిప్పటించినపుడు ప్రయాణికులు, పలు కాలనీల వాసులు ఊపిరాడక తీవ్ర ఇబ్బందులు పడేవారు. డెంగీతో పలువురు చిన్నారులు మృత్యువాత పడ్డారు. చెత్త డంపింగ్ ఎత్తి వేయాలని అప్పటి కౌన్సిలర్ గుర్రం ప్రసన్న డంపింగ్ వద్ద ధర్నా చేపట్టారు. బడంగ్‌పేట కార్పొరేషన్ అప్‌గ్రేడ్ అయిన తర్వాత అధికారుల మీద ప్రజల ఒత్తిడి పెరగడంతో డంపింగ్ యార్డు ఖాళీ చేసేందుకు అధికారులు ఉపక్రమించారు. సబితాఇంద్రారెడ్డి ఎమ్మెల్యే అయిన వెంటనే ఉన్నతాధికారులతో మాట్లాడి డంపింగ్ యార్డును తొలగించింది. డంపింగ్ యార్డు స్థలాన్ని క్రీడా మైదానానికి కేటాయించింది. నేడు ఈ మైదానం యువతకు ఎంతో ఉపయోగపడుతోంది.

రూ.3కోట్లతో అభివృద్ధి చేశాం



బడంగ్‌పేటకు వచ్చినప్పుడల్లా డంపింగ్‌యార్డుల పైనే ఫిర్యాదులు వచ్చేవి. కౌన్సిల్ మీటింగ్‌కు వచ్చినా, డంపింగ్ యార్డును ఎత్తివేయాలని వినతులు వచ్చేవి. డంపింగ్‌యార్డును బడంగ్‌పేట నుంచి జవహర్‌నగర్ తరలించేందుకు చర్యలు తీసుకున్నాం. మైదానాన్ని రూ.3 కోట్లతో అభివృద్ధి చేశాం. తెలంగాణ అమరుడు.. నియోజకర్గ ముద్దుబిడ్డ సిరిపురం యాదయ్య పేరును మైదానానికి పెట్టుకున్నాం. మైదానం చూస్తే సంతోషం కలుగుతుంది.

– సబితారెడ్డి, విద్యాశాఖ మంత్రి